

రాష్ట్రస్థాయిలో ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

సదాశివనగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఇంగ్లీష్ సబ్జెక్టుకు సంబంధించి జరిగిన ఎలక్యూషన్ పోటీలో సదాశివనగర్ ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజారెడ్డి తెలిపారు. ఆకుల సంజన మొదటి స్థానం, ఇంగ్లీష్ ఒలంపియాడ్లో సంజన ద్వితీయ స్థానంలో నిలిచి తెలంగాణ ఆదర్శ పాఠశాల సదాశివనగర్ మంచి పేరు సంపాదించారన్నారు. పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించిన గైడ్ టీచర్ భాగ్యలక్ష్మీలను అభినందించడం జరిగిందన్నారు.



జిల్లాకు.. మొండి చేయి..!

- కేంద్ర బడ్జెట్లో జిల్లాకు మరోసారి నిరాశే..
- పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు అంతంత మాత్రమే
- రైల్వేకు కేటాయించిన బడ్జెట్లో డబుల్ లైన్, కొత్త లైన్లకు నిధులు వచ్చేనా?
- రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు
- రైతులు, వేతన జీవులకు ప్రాధాన్యత కల్పించిన బడ్జెట్
- వేతన జీవుల కోసం ప్రధాన మంత్రి ధన్ధ్యాన్ కృషి యోజన పథకం
- కిసాన్ క్రెడిట్కార్డు పరిమితి పెంపు
- కేంద్ర బడ్జెట్పై జిల్లావాసుల్లో మిశ్రమ స్పందన

కామారెడ్డి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ శనివారం కేంద్ర బడ్జెట్ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్పై జిల్లా ప్రజలు ఎంతగానో ఆశపెట్టుకున్నారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తారని కొత్త సంక్షేమ పథకాలు ప్రకటిస్తారని అంతా భావించారు. సంక్షేమ పథకాలపై కేంద్రం కరుణ చూపి బడ్జెట్లో కాస్త ఊరట కల్పించే విధంగా కేటాయింపులు చేశారు. కానీ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల ఊసే ఎత్తలేదు. రైల్వేకు కేటాయించిన బడ్జెట్లో జిల్లాలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులకు ఏస్థాయిలో నిధులు వస్తాయో చూడాలి. ఇక జాతీయ రహదారుల నిర్మాణ పనులపై ఊసే ఎత్తలేదు. అభివృద్ధి పనులపై కేంద్ర ప్రభుత్వం మరోసారి నిరాశ పరిచిందని పలు వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వరాల జల్లు కురిపిస్తుందని అనుకున్న ప్రజలకు కేంద్రం నిరాశే చూపినట్లు ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యుడికి ఉపయోగపడే విధంగా లేదని తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్రం విస్మరించిందని ప్రతిపక్ష నేతలు వాపో తున్నారు. కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాలను దృష్టిలో పెట్టుకునే అమలుకాని హామీలకు కేంద్రం బడ్జెట్ కేటాయింపులు చేసిందని కాంగ్రెస్ విమర్శించింది. అదేవిధంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. ఉచితాలకు తావులేకుండా పేదవర్గాలకు ఉపయోగకరంగా ఉండే పథకాల కు బడ్జెట్లో అధిక ప్రాధాన్యత కల్పించారని బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు, వేతన జీవులకు ప్రాధాన్యత కల్పించిన బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో మధ్య తరగతి ప్రజలకు అధికార ప్రాధాన్యత కల్పించింది. ఈ బడ్జెట్లో పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. రైతులు, వేతన జీవులకు ఊరట కల్పించింది. ప్రధాన మంత్రి ధన్ధ్యాన్ యోజన ద్వారా దేశంలో వెనుకబడిన జిల్లాలో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించేందుకు ప్రత్యేక బడ్జెట్ను కేటాయించారు. గోదాంల నిర్మాణం, నీటి పారుదల వ్యవస్థ ఆధునీకీకరణ, రుణ సౌకర్యం కల్పన ద్వారా కోట్లాది మంది గ్రామీణ రైతులకు లబ్ధి చేకూర్చనుంది. అలాగే కిసాన్కార్డుల పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నామని ప్రకటించారు. దీని ద్వారా 7 కోట్ల మంది రైతులకు పైగా ప్రయోజనం కలగనుంది. గిగ్ వర్కర్లకు గుర్తింపుకార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ శ్రమ్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్న వారికి పీఎం జన్ ఆరోగ్య యోజన కింద ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించనున్నారు. దాదాపు కోటి మందికి లబ్ధిచేకూరనుంది. ఉడాన్ పథకం ద్వారా కొత్తగా 120 రూట్లలో విమాన ప్రయాణ సౌకర్యం కల్పించనున్నామని వెల్లడించారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్డీఐ ప్రకటించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ. 1.71కోట్ల నిధులను కేటాయించారు.

12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు

కేంద్రం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో సామాన్యుడికి ఊరటనిచ్చే విధంగా ఆదాయ పన్ను మినహాయింపు ప్రకటించారు. ఈ బడ్జెట్లో ఆదాయ పన్ను మినహాయింపు ఇస్తారని మధ్య తరగతి ప్రజలు ఆశించారు. అందుకు అనుగుణంగానే ఈ బడ్జెట్లో రూ.12లక్షల వరకు ఆదాయపన్ను మినహాయిస్తు కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్లో ప్రకటించారు. దీంతో సామాన్య ప్రజలకు కాస్త ఊరట లభించనుంది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు పన్ను రూపంలో రూ.80వేల ఆదాయం కానున్నాయి. రూ.20లక్షల నుంచి రూ.24లక్షల వరకు 25 శాతం రూ.16 లక్షల నుంచి రూ.20 లక్షల లోపు ఆదాయం పైన 20 శాతం పన్ను స్లాబులుగా ప్రకటించారు. కొత్త ఆదాయపు పన్ను బిల్లు కూడా లిటికేషన్లు తగ్గించేలా ఉండనుంది. స్మాల్ ట్యాక్స్ వారికి టీడీఎస్ లేదని ఈ బడ్జెట్లో ప్రకటించారు. అదేవిధంగా బీమా రంగంలో వంద శాతం ఎఫ్డీఐకి ఆమోదం తెలుపబోమని పేర్కొన్నారు. ఇన్కం ట్యాక్స్లో ఉన్న అనవసర సెక్షన్లను తొలగించనుంది.

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు కేంద్ర నిధులు విడుదలయ్యేనా?

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు, జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆయా శాఖలకు కేటాయించిన నిధుల నుంచి కేటాయింపులు వస్తాయో లేవో చూడాలి. మహారాష్ట్రలోని ముత్కెడ్ నుంచి నిజామాబాద్ హైదరాబాద్ వరకు డబుల్ రైల్వేలైన్ ఏర్పాటుకు గత సంవత్సరం కిందటే కేంద్రం గ్రీన్సిగ్నల్ ఇచ్చింది. అయితే ఈ పనులకు కేంద్ర రైల్వేశాఖ నిధుల ఖర్చు ప్రతిపాదనలు చేసింది. బోధన్ - బాన్సువాడ - బీదర్ పనుల కోసం ఈ బడ్జెట్లో రైల్వేశాఖకు కేటాయించిన నిధుల్లోంచి ఎన్నివస్తాయో చూడాలి. కరీంనగర్, కామారెడ్డి, పిట్లం వరకు జాతీయ రహదారి నిర్మాణానికి సైతం ఈ బడ్జెట్ నిధులు కేటాయించాల్సి ఉంటుంది. గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.2.66 లక్షల కోట్లు, విద్యా రంగానికి రూ.1.28లక్షల కోట్లు, ఆరోగ్య రంగానికి రూ.98.311 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.96,777 కోట్లు, ఐటీ, టెలికాం రంగానికి రూ.95,298 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.81,174 కోట్లు, వాణిజ్య, పరిశ్రమలకు రూ.65,553 కోట్లు, సామాజిక సంక్షేమానికి రూ.60,052 కోట్లు కేటాయించారు. ఇలా పలు రంగాలకు నిధులను బడ్జెట్లో ప్రతిపాదించారు.

మైనార్టీ, దళిత మహిళల భద్రత ప్రస్తావన లేదు



• షబ్బీర్అలీ, ప్రభుత్వ సలహాదారు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో మైనార్టీల, దళిత మహిళల భద్రతపై ఆందోళన చెందుతున్నారు. ఈ బడ్జెట్లో ఆ వర్గాల రక్షణకు ప్రస్తావన చేయలేదు. ఆంధ్ర, బీహార్లకు ప్రకటించిన దాంట్లో తెలంగాణకు 25 శాతం కూడా ప్రకటించలేదు. ఈ బడ్జెట్ తెలంగాణను కేంద్రం మరోసారి విస్మరించింది. తెలంగాణకు ఇండియన్ ఐఐఎం, ట్రిపుల్ ఐటీ కేటాయించాలని ఎప్పటి నుంచో కోరుతున్నా బడ్జెట్లో కేటాయింపులు చేయలేదు. 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా దక్కింది ఏమీ లేదు.

అన్నిరంగాలకు ప్రాధాన్యత



• వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్యే, కామారెడ్డి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉంది. అన్ని వర్గాలకు మేలు చేకూర్చే విధంగా బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ను రూపొందించింది. ఉచితాలకు తావివ్వకుండా ప్రతీ సామాన్యుడు, మధ్య తరగతి ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు కేటాయింపులు బడ్జెట్లో ఎక్కువగానే చేశారు. సామాన్యునికి ఉపయోగపడేలా రూ.12లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వడం, రైతుల సంక్షేమానికి కొత్త పథకాలను ప్రవేశపెట్టారు.

కేంద్రం మరోసారి మొండిచేయి చూపింది



• ముజిబోద్దీన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు మరోసారి మొండి చెయ్యే చూపింది. గత బడ్జెట్తో పోలిస్తే ఈ బడ్జెట్ పూర్తిగా బీజేపీ కేంద్రపాలిత బడ్జెట్గా ఉంది. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణను విస్మరిస్తుందనడానికి మరోసారి బడ్జెటే నిదర్శనం. తెలంగాణలోని పలు ప్రధాన ప్రాజెక్టులే కాకుండా జిల్లాలోని రైల్వే లైన్లకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించలేదు. బడుగు, బలహీన వర్గాలకు ఈ బడ్జెట్ అనుకూలంగా లేదు. వ్యవసాయ, వైద్య రంగానికి బడ్జెట్లో ప్రాధాన్యత ఇవ్వలేదు.

ఊహించినంత కేటాయింపులు లేవు



• కైలాస్ శ్రీనివాస్రావు, డీసీసీ అధ్యక్షుడు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకురేలా లేదు. బడ్జెట్ జిల్లాలోని రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు నిధులు ఊహించినంత రాలేదు. కొత్త ప్రాజెక్టులు రాలేదు. ప్రజలు ఊహించినంతగా బడ్జెట్ను ప్రభుత్వం కేటాయించలేదు. ఊరించి ఊసురు మనిపించేలా కేంద్ర బడ్జెట్ ఉంది.

కాలభైరవ స్వామి ఆలయంలో

వైభవంగా ప్రత్యేక పూజలు



రామారెడ్డి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి - ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలిసిన దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో పురోహితులు శ్రీనివాస్శర్మ మంత్రోచ్చరణలతో క్షీరాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూలైన్ ద్వారా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే విధంగా కొందరు వివిధ రకాల పూజలు నిర్వహించారు. గతంలో మొక్కిన మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా ఆలయంలోని హుండీలో కొన్ని డబ్బులను వేసినట్లు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పట్టణానికి చెందిన బద్దం పవన్, లావణ్య, తిరుమళ్ల కాశీ విశ్వనాథం గుప్తా, సుభాలక్ష్మి, గిరిణి ప్రకాష్, భానుప్రియ తెలిపారు. భక్తులు కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. అనంతరం శనేశ్వర, నాగదేవత, శివాలయం, నవగ్రహాల గుడి దేవుళ్లకు మొక్కలు మొక్కి పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయం వెనుక ఆవరణలో గల బావి నీటితో స్నానాలు చేసి తడి బట్టలతో భైరవుని గర్భగుడిలో తడిపూజలు నిర్వహించారు. ఒక్కొక్కరు ఒక్కో విధంగా భక్తులు హాజరై కట్నకానుకలు సమర్పించారు. 101 భక్తులకు ఉచితంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు వంశీకృష్ణ, వివిధ శాఖల అధికారులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆలయ సిబ్బంది నాగరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన విధుల నుంచి

ఉపాధ్యాయులను తప్పించాలి

• టీఎస్యూటీఎఫ్ అధ్యక్షుడు ఆకుల బాబు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజన విధుల నుంచి తప్పించాలని టీఎస్యూటీఎఫ్ అధ్యక్షుడు ఆకుల బాబు అన్నారు. ఉపాధ్యాయులను చదువు చెప్పడానికే నియమించారని కానీ మిగితా విధులకు ఎలా బాధ్యులవుతారని అన్నారు. ప్రభుత్వమే మధ్యాహ్నభోజన ఏజెన్సీలను నియమించి వారినే బాధ్యులను చేయాలని కోరారు. ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులను మధ్యాహ్న భోజనంలో వస్తున్నటువంటి సమస్యలపై బాధ్యులను చేయడం వల్ల వారు మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన సమస్యలపై సస్పెండ్ చేసిన ఉపాధ్యాయులను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజవర్ధన్, నర్సింహారావు, నారాయణ, సాయిగౌతమ్, ఏసు రత్నం, నాంపల్లి, బాలయ్య, గోపాల్లు పాల్గొన్నారు.

న్యాయస్థానాలు దేవాలయాలతో సమానం

హైకోర్టు న్యాయమూర్తులు శ్రీనివాస్రావు, లక్ష్మీనారాయణ



బాన్సువాడలో కోర్టు భవన నిర్మాణ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు శ్రీనివాస్రావు, లక్ష్మీనారాయణ

బాన్సువాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాలు బాధితులకు దేవాలయాలతో సమానమని హైకోర్టు న్యాయమూర్తులు జె.శ్రీనివాస్రావు, ఏ.లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు, ఫస్ట్క్లాస్ మెజిస్ట్రేట్ రూ.23.67 లక్షలతో నిర్మించనున్న నూతన భవన నిర్మాణానికి శనివారం శంకుస్థాపన భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కోర్టు పరిధిలో పెండింగ్లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. అలాగే కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులను ఉద్దేశించి బాన్సువాడలో ఐఏఎస్ అధికారిని కిరణ్మయి సబ్ కలెక్టర్గా విధులు నిర్వహిస్తున్నారని ఆమెను ఆదర్శంగా తీసుకుని విద్యార్థినులు తమ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కష్టపడి చదివి ఉన్నతమైన స్థానంలో ఉండే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, బాన్సువాడ సివిల్ జడ్జి టీఎస్పీ కుమారి భార్గవి, డీఎస్పీ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మూర్తి, మోహన్రెడ్డి, భూషణ్రెడ్డి, లక్ష్మారెడ్డి, ఖలీల్, హబీబ్, రామ్రెడ్డి, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: న్యాయస్థానాలు దేవాలయాలతో సమానమని హైకోర్టు న్యాయమూర్తులు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఎల్లారెడ్డి సివిల్ క్రిమినల్ కోర్టు ఆవరణలో రెండు నూతన కోర్టు భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు పరిధిలోని పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఎల్లారెడ్డి కోర్టు భవనం 120 సంవత్సరాల క్రితం నిర్మించినా నేటికి చెక్కు చెదరలేదని తెలిపారు. అప్పుడు సాంకేతిక పరిజ్ఞానం లేకపోయినా భవనాలను నాణ్యతగా నిర్మించారని కొనియాడారు. ఇప్పుడు నిర్మించనున్న భవనాలు నాణ్యతగా నిర్మించాలని ఆర్అండ్బీ అధికారులకు, గుత్తేదారుకు సూచించారు. పనులు జరిగిన సమయంలో న్యాయవాదులు పర్యవేక్షణ చేసి పనులు నాణ్యతగా జరిగే విధంగా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి బాన్సువాడ న్యాయమూర్తులు, ఎల్లారెడ్డి న్యాయమూర్తి హారిక, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, అదనపు కలెక్టర్ శ్రీనివాస్రెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్నాయక్, ఇన్చార్జి తహసీల్దార్ చరణ్సింగ్, ఎస్సై మహేష్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక ఉల్లాసం

పతంజలి యోగా పీఠ్ ముఖ్య కేంద్రీయ కార్యనిర్వాహకులు డాక్టర్ పరమార్థదేవ్



యోగాసనాలు వేస్తున్న ప్రజలు, విద్యార్థులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని పతంజలి యోగాపీఠ్ ముఖ్య కేంద్రీయ కార్యనిర్వాహకులు స్వామిజీ డాక్టర్ పరమార్థదేవ్ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఫ్రొబెల్స్ పాఠశాలలో మెగా శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామీజీ పలు ప్రాణాయామ, రోగానుసార యోగ పద్ధతులను వివరించారు. రుషుల పరంపరను పాటించాలని వారిలాగే మన జీవనం కొనసాగించాలని, మన ఆహారం ఎలా ఉంటుందో మనసు అలా ఉండాలని తెలిపారు. శాఖాహారం భుజించేవారు 100 సంవత్సరాలకు పైగా జీవించగలరని తెలిపారు. రెండు రోజులు కొనసాగనున్న యోగా శిబిరంలో రోగానుసార యోగ పద్ధతులను వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత్ స్వాభిమాన్ జిల్లా ప్రభారి యోగా రాంరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభారి శ్రీధర్రావు, ఉప ప్రభారి శివకుమార్, గరిపల్లి అంజయ్య, రఘుకుమార్, అంజయ్య, అనిల్రెడ్డి, అంకిరెడ్డి, రమేష్, రాజ్కుమార్, భరత్, ఎల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

ప్రతీ ఓటరుకు.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలి

• ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఓటరును కలిసి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. యువత, ఉద్యోగులు బీజేపీ వైపు ఉన్నారని అన్నారు. ప్రతీ బీజేపీ కార్యకర్త ప్రతీ ఓటరును కలిసి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పాత నోటిఫికేషన్లు భర్తీ చేస్తున్నారే కానీ కొత్త నియామకాలు ఏమి లేవని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆదాయపు పన్ను పరిమితి 12 లక్షలకు పెంచడం వల్ల ఉద్యోగులకు, మధ్య తరగతి వాళ్లకు ఎంతో ఉపశమనం కలుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు


ఏర్గట్లలో మార్కండేయ మందిరంలో పూజలో పాల్గొన్న భక్తులు


ముప్కాల్‌లో సంఘ సభ్యుల మౌనం పాటిస్తున్న దృశ్యం


బ్రహ్మణ్‌పల్లిలో ..


నవీపేటలో..


భీమ్‌గల్‌లో..

ఏర్గట్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పద్మశాలీల ఆరాధ్యదైవమైన మార్కండేయుని జయంతిని శనివారం వైభవంగా నిర్వహించారు.అందులో భాగంగా మండల కేంద్రంలోని శివ మార్కండేయ మందిరం వద్ద పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నప్రసాదం నిర్వహించగా మండలంతో పాటు ఆయా గ్రామాల్లోని భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాకేష్, శుక్లాజి, పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముప్కాల్: పద్మశాలిల ఆరాధ్యదైవంగా భక్త మార్కండేయ జయంతి వేడుకలు ముప్కాల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. శనివారం పద్మశాలి సంఘ భవనంలో మార్కండేయ మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుల బంధువుల అందరిలో ఐక్యతను సంఘటిత శక్తి, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రసాదించాలని వేడుకున్నారు. కుటుంబసభ్యులతో అన్నదానంలో పాల్గొన్నారు.

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ మందిరంలో శనివారం పద్మశాలి కులస్తులు శ్రీ మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గెంటిల సాయిలు, ఉపాధ్యక్షులు జంగం సత్యంరాజ్, దెగ్లూర్ గంగాకిషన్, ప్రధాన కార్యదర్శి గుద్దేటి వార్ కార్తీక్, కోశాధికారి దత్తు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో శనివారం మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. మార్కండేయకు మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు నిట్ శేఖర్, సభ్యులు కలిసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మార్కండేయ జయంతి సందర్భంగా స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం నాయకులు రుద్ర రాజేశ్వర్, కిషన్, రాంచందర్, గంగాదర్, కిషన్, శ్రీనివాస్, కపిల్, సతీష్, హన్మండ్లు, మహిళలు పాల్గొన్నారు.

నవీపేట: శ్రీ భక్త మార్కండేయ జయంతి వేడుకలను శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, తొట్లె, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హుస్నాబాద్‌గల్లీలో పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ మందిరంలో మార్కండేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాలను ప్రసాదించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు అంబల్ల శీను, గణపురం సంతోష్, కొక్కుల రవి, పిట్ల రాజు, సర్వసమాజ్ ప్రతినిధి చక్రధర్, లింబాద్రి, బడుగు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: పద్మశాలిల ఆరాధ్యదైవం భక్తమార్కండేయ జయంతి ఉత్సవాలను కమ్మర్‌పల్లి మండలంలోని పద్మశాలి సంఘ భవనంలో గ్రామ పద్మశాలీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి పద్మశాలి సంఘం పాలకవర్గ సభ్యులు, పద్మశాలి సభ్యులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: పద్మశాలి కులదైవం మార్కండేయ మహాముని జయంతి వేడుకలను పద్మశాలి సంఘం తర్ప-2 ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మురళీ, గంగాధర్, గోవింద్, బాస్కర్‌పాల్గొన్నారు.

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ మందిరంలో శనివారం పద్మశాలి కులస్తులు శ్రీ మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గెంటిల సాయిలు, ఉపాధ్యక్షులు జంగం సత్యంరాజ్, దెగ్లూర్ గంగాకిషన్, ప్రధాన కార్యదర్శి గుద్దేటి వార్ కార్తీక్, కోశాధికారి అంకం దత్తు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన శివభక్త మార్కండేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై పూజలు నిర్వహించారు. భగవంతుని ఆశీస్సులతో అందరు బాగుండాలని కోరుకున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సంపద సృష్టించడంలో ఆర్యవైశ్యులదే ప్రధాన పాత్ర

● రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): సందప సృష్టించడంలో ఆర్యవైశ్యులు ప్రధాన పాత్ర పోషిస్తారని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ సాయి అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం జిల్లా ఆర్యవైశ్య నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు సేవభావం కలిగినవారని అన్నారు. ఆర్యవైశ్యులు సేవ కార్యక్రమాలతో పాటు రాజకీయాలలో సేవలందించేందుకు ముందుకు రావాలని అన్నారు. దేశంలో డెబ్బై శాతం సంపద ఆర్యవైశ్యుల నుండి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పడకల్ వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి


పూజలు చేస్తున్న నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): పడకల్ గ్రామాభివృద్ధితో పాటు లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి తనవంతు అన్ని విధాల కృషి చేస్తానని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామంలో శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం జాతర ఉత్సవాలు జరుగుతున్నాయి. శనివారం ఆలయంలో స్వామివారికి కల్యాణోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామివారికి కళ్యాణోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి కళ్యాణాన్ని భక్తులు, గ్రామస్థులతో ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పడకల్ గ్రామం అంటేనే తనకెంతో అభిమానమని, ఈ గ్రామాభివృద్ధికి, ఆలయం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. ఆలయంలో కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆలయంలో రాజగోపుం నిర్మాణానికి ఎండోమెంట్ ద్వారా దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఆదివారం స్వామివారి రథోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో మాజీడీసీఎంఎస్‌చైర్మన్ ఎం.సాయిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీసర్పంచ్‌లు ఎం.చిన్నసాయిరెడ్డి, కిషన్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం, బోండ్ల అరుణ్, శ్రీధర్, పడకల్ వీడీసీసభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ భూమిపూజ రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో నిర్మించనున్న వెయ్యి నామాల వెంకటేశ్వరస్వామి ఆలయ భూమిపూజ కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రం అందజేశారు. శనివారం మండలంలోని అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కల్లెం బోజారెడ్డి, మూలకిడి శ్రీనివాస్‌రెడ్డి, పెర్కిట్ రమేష్ కల్లెం మోహన్, తదితరులు ఉన్నారు.

తొర్లికొండలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు చేరుకొని స్వామివారి కొండుచుట్టు పల్లకి సేవ నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండల శివారులోని మంజీర పరివాహక ప్రాంతాల నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వ అనుమతి పత్రాలు ఉన్న ట్రాక్టర్లు మాత్రమే ఇసుక రవాణా చేయవచ్చన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇట్టి వాహనాలను సీజ్ చేయబడతాయని హెచ్చరించారు.

● **సాలంపాడ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ**

బోధన్ మండలంలోని సాలంపాడ్ గ్రామంలో రైతుల పంట పొలాల్లో నుండి శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తుకెళ్లారని ఎస్‌ఐ తెలిపారు. దొంగలను సీసీ పుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ జరిపి పట్టుకున్నామన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనాన్ని అందించాలి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని టీఎల్‌వీ పద్మ సింగ్ అన్నారు. డీఎల్ఎస్ఏ జిల్లా ఆదేశాల మేరకు శనివారం బోధన్ పట్టణంలోని గంజ్ ప్రాంతంలో ఉన్న వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంటగది, ఆట స్థలం, వసతి గృహ పరిసరా ప్రాంతాలను పరిశీలించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం, మెనూ ప్రకారం తప్పకుండా నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వ్యక్తిగత శుభ్రత పట్ల ప్రత్యేక అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చి పెట్టాలన్నారు. ఆమె వెంట పీఎల్‌వీ రమణ రెడ్డి, పీఎల్‌వీ సుజాత, కళ్యాణి తదితరులున్నారు.

తాగునీటి ట్యాంకుల పరిశీలన

మోర్తాడ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడ్యాట్, ధోన్‌పాల్, గాండ్లపేట్ గ్రామాలను డ్రికింగ్ వాటర్ స్పెషల్‌డ్రైవ్ కింద సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్‌డ్రైవ్ ని ర్వహించారు. వాటర్‌ట్యాంకును ప్రతీవారం కచ్చితంగా శుభ్రం చే యించాలని, లీకేజీలకు వెంటనే మరమ్మత్తులు చేయించాలని, ప్రతీ ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించాలని పంచాయతీ సెక్రెటరీలకు సూచనలు చేశారు. పంచాయతీ అధికారి శ్రీధర్, మీషన్ భగీరథ ఏఈఈ జి.స్వరాజ్, పంచాయతీ సెక్రెటరీలు శ్రీకాంత్, లక్ష్మీదుర్గా, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూర్ బైపాస్ రోడ్డు వద్ద తృటిలో ప్రమాదం తప్పింది. శనివారం ఆలూర్ నుంచి అర్మూర్ వైపు వస్తున్న కారు బైపాస్ వద్దకు రాగానే అదుపు తప్పి పొలాల్లోకి దూసుకువెళ్లింది. దీంతో కారులో ఉన్న వ్యక్తులకు ఏలాంటి ప్రమాదం సంభవించలేదు.

'లక్ష డప్పులు, వేల గొంతుకలు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో చేపట్టిన లక్ష డప్పులు, వేల గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లస్సింగారి భూమయ్య అన్నారు. శనివారం హైదరాబాద్ మహనగరంలో ట్యాంక్ బండ్‌పై 7న నిర్వహించే లక్ష డప్పులు మహ ప్రదర్శన జరగబోతుందని, ఈ ప్రదర్శనకు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మాదిగ, మాదిగ ఉప కులాలు అందరు లక్ష డప్పులు, వేల గొంతుకల మహ ప్రదర్శనకు హజరైన విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ బోధన్ మండల నాయకులు తాడెం అబ్బయ్య, సాలూర మండల అధ్యక్షులు బూరె శంకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి రవి మాదిగ, అద్దంకి లింగయ్య, రమేష్, శంకర్, బాలు, శంకర్, శేషు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో కరపత్రాల ఆవిష్కరణ

కోటగిరి: ఎస్సీ వర్గీకరణ అమలుకు తలపెట్టిన లక్ష డప్పులు, వేల గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ నాయకులు పోచిరాం కోరారు. కోటగిరి మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో శనివారం లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీన హైదారాబాదులో ఎస్సీ వర్గీకరణ అమలుకై పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎల్బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శన ర్యాలీ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఎస్సీ వర్గీకరణకు అనుకూలమైన ప్రకటన చేస్తే ప్రభుత్వానికి విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. లేని పక్షంలో చావు డప్పులు కొడతామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాదిగ సోదరులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు భూమయ్య, నవీన్, లింగన్న, అబ్బయ్య, శంకర్, మనోహర్, సంజీవ్, నర్సింలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జీ మైలారం బాలు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ కోసం 30ఏళ్ళ సుదీర్ఘపోరాటం తర్వాత గత ఏడాది ఆగస్టు 1న సుప్రీం కోర్టును తీర్పును అమలు చేస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా కాలయాపన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ యునైటెడ్ ఫ్రండ్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఎమ్మార్పీఎస్ ఆర్మూర్ మండల ఇన్‌చార్జీ శ్యామ్ మాది గ, చిట్టిబాబు, మైలారం రాము, చిన్నయ్య, మార్క్, సంతోష్, చింటు, గణేష్, రా జగంగారాం, పొన్నాలచంద్రశేఖర్,వినోద్, రమేష్, సురేష్, నవీన్ పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలో శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద హైదరాబాద్‌లో లక్ష డప్పులు వెయ్యి గొంతులతో ప్రదర్శన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చి నాలుగు నెలల కాలం గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేయకపోవడం వల్ల మందకృష్ణకు ఈ నెల 7న కార్యక్రమం చేపడతామని తెలిపారు.


అంబేద్కర్ చౌరస్తాలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్: ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వ హించతలపెట్టిన మాదిగల లక్ష డప్పులు వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీఎంపీపీ పస్క నర్సయ్య కోరారు. శనివారం ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామంలో మాదిగ సంఘ సభ్యులు సమావేశంలో ఆయన మాట్లాడు తూ ప్రతీ గ్రామం నుంచి అధిక సంఖ్యలో మాదిగలు తరలివచ్చి కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని, ఈ సమావేశంలో చెలిమెల లక్ష్మణ్, సతీష్, గంగారాం, ఉంగరాల రాజన్న, రాములు, మంగ్లారం నవీన్, రాము పాల్గొన్నారు.

మెండోర: లక్ష డప్పులు వేల గొంతుల వాల్‌పోస్టర్లను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మాకూరి మహేష్‌మాదిగ ఆవిష్కరించారు. శనివారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు వేల గొంతుల సాంస్కృతిక ప్రదర్శన గోడ పత్రాలను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేష్‌మాదిగ మాట్లాడుతూ లక్ష డప్పులు వేల గొంతుల మహాఆ ప్రదర్శనను జిల్లా నుంచి వేలాదిగా డప్పులతో బయలుదేరి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ మండల ఉపాధ్యక్షుడు గుంటి నిశాంత్, ఎమ్మార్పీఎస్ నాయకులు గోపి, కోడిచర్ల, దూదిగాం డెవిడ్, మాకూరి గణేష్, రాకేష్, సాయన్న, రిషి, జయరాజ్, ప్రణయ్, రాజారత్నం, సుమాన్, సురేష్, గుంటి సాయన్న, శీను, మాదిగలు, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పు వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణ కేంద్రంలోని ఎస్సీవాడలో మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం పత్రులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ నాయకులు గంగారాం, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద ప్రభాకర్, చెప్పాల గణేష్, జెజె నర్సయ్య, లక్ష్మణ్, అశోక్, రాజన్న, గంగాధర్ పాల్గొన్నారు.

భార్య బాధ తాళలేక గోదావరిలో దూకి ఆత్మహత్యా

నవీపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన రావుల దమ్మయ్య(35)అనే వ్యక్తి శుక్రవారం రాత్రి యంచ గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. దమ్మయ్యకు పోసాని అనే పెద్ద భార్య, సవిత అనే చిన్న భార్యలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కూలీ పని చేసుకుని జీవించే దమ్మయ్యకు రెండవ భార్య సవిత, ఆమె సోదరి రామవ్వలు తరుచుగా ప్రతి చిన్న విషయానికి గొడవ పడడంతో పాటు బూతులు తిట్టే వారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి అక్కచెల్లెలు అయిన సవిత, రామవ్వలు ఇంటి వద్ద గొడవ పడగా నేను బతికి ఉండడం మీకు ఇష్టం లేదని పేర్కొంటూ దమ్మయ్య బైక్‌పై యంచ గోదావరి వద్దకు వెళ్లాడని అన్నారు. బ్రిడ్జిపైన బైక్, చెప్పులను పక్కకు ఉంచి నదిలో దూకాడని అతని మృతదేహం శనివారం నదిలో నుండి బయటపడిందని ఎస్‌ఐ వివరించారు. మృతుడి సోదరుడు మారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోమన్‌పల్లిలో చిన్నారిపై కోతుల దాడి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామంలో మూడేళ్ళ హీరణ్యపై శనివారం కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. రోహన్‌గౌడ్ జీవన దంపతుల కుమార్తె హీరణ్య తన ఇంటి ప్రహరీ లోపల ఉన్న సమయంలో కోతులు దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. హీరణ్యపై సుమారు 20నుంచి 30కోతుల మంద దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గాయపడ్డ చిన్నారిపై చికితకోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కొన్ని రోజులుగా కోతుల బెడద ఎక్కువైందని ఏ సమయంలో ఎటు వైపు నుంచి దాడి చేస్తాయన్న భయాందోళనలు నెలకొన్నాయి.

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్ సీజ్


డొంకేశ్వర్, ఫిబ్రవరి 1 (ఆం ధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను తహ సీల్దార్ నరేష్‌కుమార్ సీజ్ చేశారు. డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామంలో మస్క ట్ చిన్న రాజన్న ఇంటి పక్కన నిల్వ ఉన్న 16ట్రాక్టర్ల ఇసుక డంప్‌పై సమాచారం అందగా ఆర్‌ఐ అశోక్‌సింగ్ చేరుకొని వివరాలను సేకరించికాశపు రవి డంప్ చేసిన ఇసుకను గు ర్తించా రు. ఎటువంటి ఆధారా లు లేకపో వడంతో ఇసుకను సీజ్ చేసి పంచాయతీ ఆధీనంలో ఉంచారు. ఈ ఇసుకను ఈనెల 3వ తేదీన వేలంపాట వేస్తున్న ట్లు తహసీల్దార్ నరేష్‌కుమార్ తెలిపారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

ముప్కాల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన అంకమ్మ పురిటినొప్పులతో రాత్రి 12.30గంటలకు అంబులెన్స్‌కు ఫోన్ చేయగా అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే గర్భిణికి నొప్పులు అధికంగా రావడంతో అంబులెన్స్ సిబ్బంది సహకరించడంతో ఆడపిల్లకు జన్మనిచ్చింది. దీంతో తల్లి, పుట్టిన బిడ్డ క్షేమంగా ఉన్నట్టు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

రైతు భరోసా దరఖాస్తు గడువు పెంచండి సారూ!

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయదారులకు పంట పెట్టుబడి సహాయం అందించేందుకు గాను ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకంకు సంబంధించిన ఆన్‌లైన్ సైట్‌ను అధికారులు శుక్రవారం క్లోజ్ చేశారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి పంట పెట్టుబడి కింద గత ప్రభుత్వం ఎకరాకు 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించగా, గత ఏడాది ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని 6 వేల రూపాయలకు పెంచారు. ఈ పథకం కింద జనవరి 01 2025 వరకు కొత్తగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు ఈ సారి దరఖాస్తు చేసుకోవాలని నిబంధన విధించారు. అయితే కొందరు రైతులు దరఖాస్తు చేసుకోగా చాలామంది రైతులు దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోయారు. గతంలో రైతు భరోసా(రైతు బంధు) పథకంకు అర్హులుగా ఉన్నవారి వివరాలు గుర్తించి వ్యవసాయ శాఖ అధికారులు రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించేవారు. అయితే ఈ సారి వ్యవసాయ శాఖ అధికారులు రైతు భరోసా పథకంకు అనర్హులను గుర్తించే పనిలో ఉండగా గ్రామ స్థాయిలో రైతుల వరకు సమాచారం వెళ్లలేదు. దీంతో కొత్తగా రైతులు భరోసా పథకంకు దరఖాస్తుచేసుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారుల దగ్గరకు వెళుతుండడంతో ఇందుకు సంబంధించిన సైట్ బంద్ అయిందని అధికారులు చెప్పడంతో రైతులు నిర్ఘాంతపోతున్నారు. గతంలో రైతు భరోసా పడే సమయంలో సైట్ ఆన్ ఉండేదని, ఈసారి అధికారులు దీనిని జనవరి 31 వరకు కుదించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక జిల్లా వ్యాప్తంగా 17215 మంది రైతులు ఈ సారి కొత్తగా రైతు భరోసా పథకం అర్హులని వ్యవసాయ శాఖ



పిట్లం మండల కేంద్రంలో గల రైతు వేదిక.

అధికారుల వద్ద లెక్కలు ఉండగా ఎంతమంది రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకున్నారో వ్యవసాయశాఖ అధికారులకే తెలియాలి. ఈ విషయం గురించి జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ వివరణ కోరగా కొత్తగా రైతు భరోసాకు సంబంధించిన ఆన్‌లైన్ సైట్ ముగిసిన మాట వాస్తవమే అని, రానున్న రోజుల్లో ఉన్నతాధికారులు గడువును పెంచే అవకాశం ఉండవచ్చని తెలిపారు.

తక్కువ ఖర్చుతో ఎక్వేరియం తయారు చేసిన విద్యార్థులు

ముప్కాల్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలం రెంజర్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వాడిపారేసిన వస్తువులతో తక్కువ ఖర్చుతో ఎక్వేరియం తయారు చేశారు. పాత వాటర్ బబుల్, ఎల్ఈడీ లైట్, ఎరేటర్, గవ్వలు, రంగురాళ్లను ఉపయోగించి స్థానికంగా దొరికే చేపలను ఇంటి సంరక్షించుకున్నారు.

మున్సిపల్‌ను సందర్శించిన ప్రాంతీయ సంచాలకుడు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మున్సిపల్ కార్యాలయాన్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వరంగల్ ప్రాంతీయ సంచాలకుడు షాహిద్ మసూద్ శనివారం సందర్శించారు. ఇటీవల నియమించిన వార్డు ఆఫీసర్‌తో పాటు అన్ని శాఖల సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమకొండలో ఎమ్మెల్యే పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

దోమకొండ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో శనివారం మార్కండేయ జయంతి సందర్భంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి హజరై పూజలు నిర్వహించారు. పద్మశాలి సంఘం సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

భిక్కనూరు:మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలోని శ్రీ మార్కండేయ ఆలయ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. శనివారం మార్కండేయ జయంతిని పుర్కరించుకుని ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఆలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌కు కాలనీ వాసుల వినతి

బాన్సువాడ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):బాన్సువాడ పట్టణంలోని పాత అంగడి బజార్ చౌరస్తా రాముల హోటల్ పక్కన గల మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుకు 17వ వార్డు కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్‌స్థలం పక్కనే వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ఉందని ప్రధాన రహదారి పక్కన మున్సిపల్ స్థలము ఉండడంతో కొంతమంది కబ్జా చేసేందుకు కన్నువేశారని వెంటనే ఆ స్థలాన్ని మున్సిపల్ స్వాధీనం చేసుకొని న్యాయం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే వీరబ్రహ్మేంద్ర ఆలయానికి వెళ్లేందుకు కొంత స్థలం దారి ఇవ్వాలని కోరడం జరిగింది. పూర్తి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని కమిషనర్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీలో మిగిలిపోయిన సోయా కొనుగోలు చేయిస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట

పెద్దకొడప్‌గల్,ఫిబ్రవరి 01 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు తాము పండించిన సోయా పంటను ఈ పాటికే మద్నూర్ మార్కెట్‌లో కమిటీలో నాఫెడ్ ద్వారా కొనుగోలు చేశామని, ఇంక రైతుల వద్ద మిగిలిన సోయా లను కొనుగోలు చేయిస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతాంరావ్ తెలిపారు. శనివారం డిల్లీ వెళ్లిన తోట పార్లమెంట్‌లో సంబందిత మంత్రులను కలిసి సోయా పంటను కొనుగోలు చేయాలంటూ విన్నవించారు. దీనికిక స్పందించిన కేంద్ర మంత్రులు సోయా పంటను కొనుగోలు చేస్తామని హామి ఇచ్చినట్లు తోట తెలిపారు. జుక్కల్ రైతుల శ్రేయస్సే తన ధ్యేయమని మిగిలిపోయిన సోయా పంటను కొనుగోలు చేయిస్తామని తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


దామరంచలో కుళాయి నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

బీర్కూర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో భానుప్రకాష్ గ్రామ పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం దామరంచ, రైతునగర్ గ్రామాలలో ఆయన పర్యటించారు. డ్రింకింగ్ వాటర్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా రెండు గ్రామాలలో అన్ని వీధులు తిరుగుతూ తాగునీటి సరఫరాపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నానని అన్నారు. ఆయన వెంట ఎంపీవో మహబూబ్, ఏఈఈ పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌మార్కెట్ చోరీ కేసులో నేరస్తుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐచంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్‌చౌరస్తా సమీపంలో ఉన్న విజయ సూపర్‌మార్కెట్‌లో గత వారం కింద జరిగిన దొంగతనం కేసులో నేరస్తులను అరెస్ట్‌చేసినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.మెదక్‌జిల్లా టెక్‌మల్ గ్రామానికి చెందిన లంబాడి దేవసోత్ రాజు, లంబాడి బుట్టరాజు గతంలో పాపన్నపేట,టెక్మాల్, మెదక్,నర్సాపూర్,సంగారెడ్డి మొదలగు పోలీసుస్టేషన్‌ల పరిధిలో దొంగతనాలు ఏసి జైలుకు వెళ్లి వచ్చారని తెలిపారు.ఈ మధ్యలోనే జనవరి నెలలో జైలు నుండి రిలిజ్ అయి ఆ తర్వాత తిరిగి దొంగతనాలు చేసే ఉద్దేశ్యంతో కామారెడ్డి, తుప్రాన్‌లలో గోడలకు కన్నం వేసి దొంగతనాలు చేసిన్నట్లుగా ఒప్పుకున్నారని తెలిపారు. వీరి వద్ద నుండి ఒకమోటార్ సైకిల్, ఒకగడ్డపార, 2 ఫోన్లను స్వాధీనపరుచుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

కొండాపూర్ ప్రాథమిక పాఠశాల పరిశీలన


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో పూర్ణచందర్‌రావు

రాజంపేట,ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని కొండాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఎంఈవో పూర్ణచందర్‌రావు పరిశీలించి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మన ఊరుమనబడి పనులు మధ్యలో ఆపివేసి ఇప్పటికి కూడా మళ్లి ప్రారంభించకపోవడం, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయకపోవడం వలన విద్యార్థులు చాలారకాల ఇబ్బందులకు గురవుతున్నారని తల్లిదండ్రులు తెలిపారు.

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు

రామారెడ్డి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం వైభవంగా మార్కండేయ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం మార్కండేయ సుప్రభాతంతో ప్రారంభమై అనంతరం సంఘం భవనంపైన సంఘ అధ్యక్షులు దోమల శ్రీధర్‌చే పులి జెండా ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం పద్మశాలి సంఘం అధ్యక్షులు దోమల శ్రీధర్ లక్ష్మీ దంపతులతో మార్కండేయ రుద్రాభిషేకం పూజను పద్మశాలి పురోహితుడు బత్తిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కాముని కృష్ణ, ప్రధాన కార్యదర్శి సుప్పని రవి, కోశాధికారి భూపతి శ్రీనివాస్, వైద్యులు అంకం గంగాధర్, సామల రాజేశ్వర్, రమేష్, శ్రీనివాస్, రాజలింగం, నాయకులు దుర్గా ప్రసాద్, గణేష్, మధు, సుప్పని గంగాధర్, బత్తిని శ్రీకాంత్, రేషన్ డీలర్ బిట్ల శ్రీనివాస్, సిరిపురం శ్రీహరి, కుర్రి శంకర్, నరేందర్, సిద్ధ రాములు, భూపతి, నాగరాజు, రవి, భరత్, గణేష్, సిరిపురం రాజేందర్, సంతోష్, శ్రీనివాస్, బుర్ల గంగాధర్, పాముల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో మార్కండేయ జయంతి వేడుకలను పద్మశాలీలు ఘనంగా నిర్వహించారు. మార్కండేయ జయంతి సందర్భంగా పంచామృత్ అభిషేకం ప్రధాన వీధుల గుండా మార్కండేయుని ఉత్సవ విగ్రహంతో శోభయాత్ర నిర్వహించారు. మార్కండేయ జయంతిని పురస్కరించుకుని పదోతరగతి,ఇంటర్‌లో ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులకు పద్మశాలి ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు రాజు, శ్రీనివాస్,హనుమాన్లు, భూమయ్య, ప్రతాప్,రాజు,వెంకటేశం, బాలరాజు, హన్మండ్లు,నల్చర్‌రాజు, బస్వరాజ్ పటేల్, నౌషానాయక్, ఖలీల్, కొలవర్‌కుమార్, యాదవ్‌రావు,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగాధర్,భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామారెడ్డి: కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం వైభవంగా మార్కండేయ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం మార్కండేయ సుప్రభా తంతో ప్రారంభమై అనంతరం సంఘం భవనంపైన సంఘ అధ్యక్షులు దోమల శ్రీధర్‌చే పులి జెండా ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం పద్మశాలి సంఘం అధ్య క్షుడు దోమల శ్రీధర్ లక్ష్మీ దంపతులతో మార్కండేయ రుద్రాభిషేకం పూజను పద్మశాలి పురోహితుడు బత్తిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కాముని కృష్ణ, ప్రధాన కార్యదర్శి సుప్పని రవి, కోశాధికారి భూపతి శ్రీనివాస్, వైద్యులు అంకం గంగాధర్, సామల రాజేశ్వర్,రమేష్, శ్రీనివాస్,రాజలింగం, నాయ కులు దుర్గాప్రసాద్, గణేష్, మధు, సుప్పని గంగాధర్, బత్తిని శ్రీకాంత్, రేషన్ డీలర్ బిట్ల శ్రీనివాస్,సిరిపురం శ్రీహరి,కుర్రిశంకర్,నరేందర్, సిద్ధ రాములు, భూపతి, నాగరాజు, రవి, భరత్, గణేష్, సిరిపురం రాజేందర్, సంతోష్, శ్రీనివాస్, బుర్ల గంగాధర్, పాల్గొన్నారు.

బాన్సువాడ: బాన్సువాడ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం శ్రీ భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకుని మహిళా సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని మార్కండేయ మందిరం నుంచి ప్రారంభమైన కళశాల ర్యాలీ సిద్దిగల్లి గాంధీ చౌక్, జండగల్లి సాయిబాబా రోడ్డు మీదుగా మారకండేయ మందిరానికి తిరిగి కలశాలను నెత్తిన ఎత్తుకుని మహిళలు భారీ సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగా ధర్, సంఘం అధ్యక్షులు జిల్లా కాశీనాథ్, ఆలయ అధ్యక్షులు గూడశ్రీనివాస్, సంఘ సభ్యులు బాల్‌రాజ్, నరహరి, బాలకృష్ణ, రమేష్, అనిల్, లక్ష్మణ్, రాజు, మహిళా సభ్యులు విజయ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

లింగంపేట: లింగంపేట మండల కేంద్రంలోని పద్మశాలి సంఘంలో శనివారం పద్మశాలి ఘనంగా మార్కండేయ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘంలో అచల గురుపీఠం బొమ్మెర మురళి మహారాజ్ ఆధ్వర్యంలో మార్కెండేయ పూజ వ్రతాన్ని నిర్వహించి మార్కండేయ ముని చరిత్రను భక్తులకు వివరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులను మొక్కారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సంతోష్, కార్యదర్శి వెంకన్న, కోషాధికారి రాజు, సంఘం పెద్దలు గంగాధర్, మారితి, నర్సింలు, సురేష్, శ్రీనివాస్ నరేష్, ప్రకాష్, బాబా, సాయన్నలతో పాటు సంఘం సభ్యులు ఉన్నారు.

తాడ్వాయి: తాడ్వాయి మండల కేంద్రంలో శనివారం ఘనంగా మార్కండేయ


బిచ్కుందలో ర్యాలీ నిర్వహిస్తున్న పద్మశాలి సంఘ నాయకులు

జయంతి ఉత్సవాలను పద్మశాలి సంఘ ఆధ్వర్యంలో నిర్వహించారు. పద్మశాలి సంఘ సభ్యులు మహిళలు భక్తి శ్రద్ధలతో గ్రామంలో కలశ పూజ, వివిధ వీధుల గుండా ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలోనే కాక వివిధ గ్రామాల్లో కూడా పద్మశాలి సంఘ సభ్యులు మార్కండేయ జయంతి ఉత్సవాలను నిర్వహించుకున్నారు.ఈకార్యక్రమంలో పద్మశాలి సంఘసభ్యులు గ్రామస్తులు ఉన్నారు.

గాంధారి: మార్కండేయ జయంతిని పురస్కరించుకుని గాంధారి మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కలశయాత్ర వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై గౌరమ్మ విగ్రహాన్ని సంఘభవనం నుంచి మార్కండేయ మందిరంవరకు, మహిళలు కలశాలను నెత్తినబెట్టుకుని శోభయాత్ర నిర్వహించారు. గాంధారి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా రథంపై ఊరేగింపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎల్‌పీఓ సురేందర్ విచ్చేసి భక్తులకు ప్రవచనాలుచేశారు. స్వామికి ఉయ్యాల సేవ, అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బండిరాజులు, మహేష్, శ్రీను, రాజు,నారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మండల కేంద్రంలో శనివారం భక్త మార్కండేయ జయంతిని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జయంతిని పురస్కరించుకుని తెల్లవారు జాము నుంచి మార్కండేయ ఆలయంలో అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలో భక్తులు ప్రధాన రహదారుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా జై శ్రీరామ్ జై జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేయడంతో మండల కేంద్రం మారుమోగింది.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రమణ, మండల కార్యనిర్వాహక అధ్యక్షులు రచ్చ కుశాల్, కోశాధికారి వెంకటేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు నాగనాథ్, ఉప అధ్యక్షులు సురేష్, రచ్చ నగేష్, ఆలయ కమిటీ సభ్యులు శశికాంత్, జగదీష్ కోశాధికారి శ్రీనివాస్, పద్మశాలిలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని లింగారెడ్డిపేట్ వార్డులో సోమవారం పద్మశాలి సంఘం సభ్యులు ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం సభ్యులు పెద్దఎత్తున పాల్గొని అభిషేకాలు, కుంకుమార్చన, ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో పెద్దలు, చిన్నారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ: శ్రీ భక్త మార్కండేయ జయంతి వేడుకలను పురస్కరించుకొని శనివారం బాన్సువాడ పట్టణంలోని మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మార్కండేయ జయంతి వేడుకల్లో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్ పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు కాసుల బాలరాజుకు ఆశీర్వాదాలు అందజేశారు. అదేవిధంగా ఆలయ కమిటీ సంఘం ఆధ్వర్యంలో కాసుల బాలరాజు తోపాటు ఎజాజ్ అంజిరెడ్డి జుబేర్ లను ఘనంగా శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ సంఘం అధ్యక్షులు జిల్లా కాశీనాథ్ ఆలయ అధ్యక్షులు గూడ శ్రీనివాస్ సంఘ సభ్యులు బాలరాజ్, నరహరి, బాలకృష్ణ, రమేష్, అనిల్, లక్ష్మణ్, జంగం రాజు, మహిళా సభ్యులు జంగం విజయ, బిజ్జరిలత, రేఖ, సీమ, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ మహాసభ విజయవంతం చేయాలి


బీర్కూర్‌లో మాట్లాడుతున్న మాదిగ సోదరులు

మద్నూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ సాధనకై ఫిబ్రవరి 7న తలపెట్టిన లక్ష డప్పులు, వెయ్యి గొంతులు మహాసభను విజయవంతం చేయడానికి మాదిగలు ఏకమై కదం తొక్కాలని మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు గోజేగావ్ విజయ్ పిలుపునిచ్చారు. మద్నూర్ మండల అధ్యక్షుడు మేత్రి మారుతి మాదిగ ఆధ్వర్యంలో శనివారం మద్నూర్ మండలంలోని లచ్చన్ గ్రామాల్లో మాదిగ సంఘం నాయకులను కలిసి సభను విజయవంతం చేసే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, యాదురావు, బీంరావు, శంకర్ తదితరులు ఉన్నారు.

భిక్కనూరు: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు వెయ్యి గొంతుల భారి బహిరంగసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ కోరారు. శనివారం వారు భిక్కనూరులో మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ లక్ష డప్పులు వెయ్యి గొంతుల బహిరంగసభకు కామారెడ్డి జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి పెద్దఎత్తున ఎమ్మార్పీఎస్ నాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు లక్ష్మణ్‌మాదిగ, మండల అధ్యక్షుడు కర్రోలే రాజు, నాయకులు భిక్షపతి, పైతరి స్వామి, కోక స్వామి, తుడుం జీవన్, రామగల్ల బాబు, ప్రభాకర్, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్

బీర్కూర్: తెలంగాణలో ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపటాలని ఎమ్మార్పీఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు బీర్కూర్, కిష్టాపూర్, చించోల్లి, అన్నారం గ్రామాలలో పర్యటించారు. హైదరాబాద్‌లో ఈనెల 7న మంద కృష్ణ మాదిగ తలపెట్టిన లక్ష డప్పులు వెయ్యి గొంతుకల భారీ బహిరంగ సభకు మాదిగ సోదరులు పెద్ద ఎత్తున తరలి రావాలని బాన్సువాడ ఇంచార్జి బాగారు రవి పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 7 లోపు ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోతే మాదిగ సోదరులు 7న హైదరాబాద్‌కు తరలి వెళతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంగాధర్, వీరేశం, దత్తు, సాయిలు, గంగారాం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బైరాపూర్ నుంచి బాసరకు పాదయాత్ర


పట్టణంలోని సరస్వతి ఆలయం వద్ద శ్రీ సరస్వతి స్వాములు

బీర్కూర్ ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): హిందూ పంచాంగం ప్రకారం ప్రతి ఏడాది మాఘ మాసంలో శుద్ధ పంచమి రోజున వసంత పంచమిని జరుపుకుంటారు. ఈ పవిత్రమైన రోజున సంగీతం కళలకు దేవత అయిన సరస్వతి దేవి జన్మించినట్లు పురాణాల ద్వారా తెలుస్తుంది. ఈ పండుగ పర్వదినాన ప్రతీ ఒక్క పాఠశాల, కళాశాలతో పాటు ప్రముఖ బాసరలోని సరస్వతి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహి స్తారు. ఈ రోజున సరస్వతి దేవిని పూజించిన వారికి ఎంతో పుణ్యం లభిస్తుందని నమ్ముతారు. వసం త పంచమి సందర్భంగా బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామానికి చెందిన యువ కులు శనివారం బాసరకు పాదయాత్రగా తరలివెళ్లారు. గత ఎనిమిది సంవత్సరా లుగా పాదయాత్ర చేస్తూ బాసరకు వెళుతున్నానని యువకులు తెలిపారు.

బాన్సువాడ:పట్టణంలోని శ్రీశ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో గత 41 రోజులుగా సరస్వతి మాత దీక్షా పూనుకొని బాన్సువాడ నుంచి బాసర సరస్వతి దేవాలయం వరకు సరస్వతి స్వాములతో పాటు అమ్మ స్వాములు భారీ సంఖ్యలో మహా పాద యాత్రగా ప్రతి సంవత్సరం భారీ సంఖ్యలో తరలివెళ్లారు. శనివారం పట్టణంలోని సర స్వతి ఆలయం వద్ద సరస్వతి స్వాములకు అమ్మ స్వాములు మహాపాదయాత్రను ప్ర భుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. రెండు రోజుల్లోగా బాసరకు పాద యాత్రగా స్వాములు వెళ్లి ప్రత్యేక దర్శనాలు చేసుకుని అమ్మ వారిని దర్శించు కుంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు శంభురెడ్డి, ఆలయఅర్చకులు సంతోష్‌శర్మ, సరస్వతిస్వాములు, అమ్మ స్వాములు పాల్గొన్నారు.

కార్మికుల జీతాలు చెల్లించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి,బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న కార్మికులకు ఐదునెలలు అవుతున్న జీతాలు చెల్లించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్రనాయకుడు వీఎల్ నర్సింహరెడ్డి అన్నారు.వేతనాలు ఇవ్వమంటే పనుల నుంచి తొలగిస్తామని కాంట్రాక్టర్‌లు బెదిరిస్తున్నారని కార్మికులు వాపోతున్నారని ఒకవేళ ఆ విధమైన చర్యలకు దిగుతే కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతామని కార్యక్రమంలో ఏఐ టీయూసీ నాయకులు బాలరాజు, పాల్గొన్నారు.

నాయకులకు ఒకలెక్క..సామాజిక సేవకులకు మరోలెక్కనా

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాజకీయనాయకులకు ఒక లెక్క...సామాజిక సేవకులకు మరో లెక్కనా మున్సిపల్ అధికారులు పనిచేస్తున్నారని సామలశీల సాగర్ అన్నారు.శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎన్ఆర్‌ఐ బల్లఆంజనేయులు జన్మదినం సందర్భంగా పలు సేవ కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలతో పాటు ఆయనకు శుభాకాంక్షలు తెలిపే ప్లెక్సీలు ఏర్పాటుచేస్తే మున్సిపల్ అధికారులు తొలగించారని అన్నారు. ఎన్నికల కోడ్ ఉందని ఏ రాజకీయ నాయకుల ఫోటోలు పెట్టకుండా ప్లెక్సీలు ఏర్పాటుచే స్తే తీసేసిన అధికారులు మరి ఎన్నికల కోడ్ వచ్చిన వెంటనే రాజకీయ నాయకుల ప్లెక్సీలను తీయకుండా ఎలా అనుమతించారని అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బందం వేణుగోపాల్,గుర్రాలరవి, రాజేందర్,మహేష్, అంజగౌడ్, భాస్కర్, సింహం,సుమన్‌చారి,రవి, అజయ్,శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జగదాంబ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని బెజ్జం చెరువు తండా లో శ్రీ జగదాంబ దేవిశ్రీ సంత్ సేవాలాల్ మహ రాజ్ నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. బెజ్జం చెరువు గిరిజన తండా లో శుక్రవారం ప్రారంభమైన ఈ విగ్రహ ప్రతి ష్ఠాపన ఉత్సవాలు మూడు రోజులపాటు జరగను న్నాయి. శనివారం రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా హోమాలు, పూజ, మంగళ హారతి తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పురుహితులు శివ కుమార్ శర్మ, పూజారి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మూడో రోజు ఆదివారం ఆలయానికి పౌర పీఠాధిపతి శ్రీ బాబు సింగ్ మహారాజ్ పాల్గొని జగదాంబ దేవి, సేవాలాల్ మహారాజ్ మూర్తి యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం జరుగనుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదలు స్వీకరించాలని వారు కోరారు. శనివారం రెండో రోజు జరిగిన ఉత్సవాల్లో ఎల్లారెడ్డి మార్కెట్ చైర్ పర్సన్ రజిత వెంకట్రాం రెడ్డి, నాగిరెడ్డిపేట మండల మాజీ జడ్పీటిసి మనోహర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు రాంచంద్రా రెడ్డి, ధనుంజయ్ పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

- శాంతి - సంక్రాంతికి వస్తున్నాం
- దర్శన్ - పుష్ప-2
- ప్రియా 70 - డాకు మహారాజ్
- ప్రియా 35 - గేమ్ చేంజర్

బాన్సువాడ

- మహేశ్వరి - సంక్రాంతికి వస్తున్నాం
- వెంకటేశ్వర - డాకు మహారాజ్

చికెన్ ధరలు




రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

విద్యార్థులతో సబ్ కలెక్టర్ భోజనం


దామరంచ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్

బీర్కూర్ ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి శనివారం దామరంచ ఉన్నత పాఠశాలను సందర్శించారు.మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేశారు.అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.మెనూప్రకారం విద్యార్థు లకు భోజనాన్ని అందించాలని సబ్ కలెక్టర్ ఆదే శించారు. ఆమె వెంటఎంపీడీవో భానుప్రకాష్, తహ సీల్దార్ లత,ఎంఈవోవెంకన్న,ఎంపీవో మహబూబ్, ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

టీజీవీపీ కామారెడ్డి నియోజకవర్గ ఇంచార్జిగా సమీర్ నియామకం

భిక్కనూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): టీజీవీపీ కామారెడ్డి నియోజకవర్గ ఇంచార్జిగా భిక్కనూరు పట్టణానికి చెందిన సమీర్‌ఖాన్ ఎన్నికయ్యారు. శనివారం జిల్లా ఇంచార్జి అనిరుద్‌రాజు చేతుల మీదుగా సమీర్‌ఖాన్ నియామకపత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థ బలోపేతానికి కృషిచేస్తానని, తనను నమ్మి నియోజకవర్గ ఇంచార్జిగా నియమించి జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

కరపత్రాల విడుదల

మాచారెడ్డి,ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలోని ఇసాయిపేట గ్రామంలో శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరుతూ గ్రామస్తులు కరపత్రాలను విడుదల చేశారు. గ్రామంలో శ్రీరామలింగేశ్వర స్వామి రామమందిరం నూతనంగా నిర్మిస్తు పనులు పూర్తిచేస్తున్నారు. గ్రామస్తులు దాతల సహాయంతో ఈ ఆలయాలను నిర్మించి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి శరవేగంగా పనులను జరిపిస్తున్నారు. గ్రామస్తులు అందరూ ప్రాణప్రతిష్ఠ విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు,భక్తులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుల పరిశీలన

రామారెడ్డి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల కేంద్రంలో శనివారం వాటర్ ట్యాంకులను ఎంపీడీవో ఏలేటి తిరుపతిరెడ్డి, ఎఇ ఆర్ డబ్యు ఎస్ వంశీ పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన కట్టిన నూతనంగా కట్టిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను నీటి సరఫరా విధానాన్ని కుణ్ణంగా పరిశీలించారు. త్వరలో ఎండాకాలం రానున్న రోజుల్లో దగ్గర పడ్డాయని ముందస్తుగా పై అధికారుల ఆదేశాల మేరకు వాటర్ ట్యాంకులను పరిశీలించామని ఎంపీడీవో తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యద ర్శులు క్రాంతి కుమార్, పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శనివారం అధికారులతో కలిసి ఎంపీడీవో ప్రభాకర్ చారి శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వ్యవసాయ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ శ్రీని వాస్ రావు, హౌసింగ్ డీఈ సుభాష్ ,ఏఈ అశోక్, ఉపాధి హామీ ఏపీవో సాయిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

తాడ్వాయి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇల్లు మోడల్ హౌస్‌కు శనివారం భూమిపూజ చేసినట్లు మండల అధికారి సయ్యద్ సాజీద్ అలీ తెలిపారు. దీని విలువ ఐదు లక్షల రూపాయలు ఉంటుందని అన్నారు. దీనిని 45 రోజులలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ, తహసీల్దార్ రహీముద్దీన్, మండల అధికారులు తదితరులు ఉన్నారు.

రాజంపేట: రాజంపేటమండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శనివారం డీపీఓ శ్రీనివాస్‌రావు పరిశీలించారు.ఈ సందర్భం గా అయన మాట్లాడుతూ గ్రామాలల్లోనీటి ట్యాంక్‌లు, మురుగు కాలువలు బ్లీచింగ్ చేసి వార్డులు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు,కార్యదర్శులు పాల్గొన్నారు.